క్లుప్తంగా

వరద బాధితులకు పొత్తూరు జెడ్పీ విద్యార్థుల విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: వరద బాధితుల సహాయార్థం గుంటూరు రూరల్ పొత్తూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.12,633లు సీఎం రిలీఫ్ ఫండ్ పేరుతో తీసిన డీడీని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజకు పాఠశాల హెచ్ఎం ఎ.మధుమోహన్ గురువారం కలెక్టరేట్‌లో కలిసి అందజేశారు. వరద బాధితులు పడుతున్న కష్టం, బాధలను టీవీలు, దినపత్రికల ద్వారా తెలుసుకున్న విద్యార్థులు చలించిపోయి తల్లిదండ్రులతో పాటు గ్రామస్తుల నుంచి విరాళాన్ని సేకరించారని హెచ్ఎం మధుమోహన్ జేసీ దృష్టికి తెచ్చారు. ఈసందర్భంగా విద్యార్థులను జేసీ భార్గవ్‌తేజ అభినందించారు. జేసీని కలిసిన వారిలో ఉపాధ్యాయులు ఉప్పాల రామమోహనరావు, ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

సీతారాం ఏచూరి మృతి తీరనిలోటు



పెదకాకాని: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ అన్నారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీలో గురువారం సీతారాం ఏచూరి మృతిపై సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం చివరిశ్వాస వరకు సీతారాం ఏచూరి పోరాడారన్నారు. ఆయన ఆశయాలను ముందుకి తీసుకువెళ్లడమే ఘనమైన నివాళి అని పేర్కొన్నారు. తొలుత మండల కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ కమిటీ సభ్యులు కోటిపల్లి సత్యనారాయణ, ఉల్లంగుల శివయ్య, బురదగుంట సాంబయ్య, జెట్టి రాజలక్ష్మి, షేక్ హసీనా, ఎం.వెంకాయమ్మ, సంకూరి యేసురత్నం, తదితరులు నివాళులర్పించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



పెద్దివారిపాలెం(కాకుమాను): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతి రోజు రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని పెద్దివారిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఎంఈఓ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతి రోజు భోజనాన్ని అందించి ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆయన సూచించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఈవూరి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సామాజికసేవలో భాగస్వాములు కావాలి

గుంటూరు ఎడ్యుకేషన్: సామాజికసేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని కళాశాలలో స్కూల్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో గురువారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలోని ప్రముఖ ఆస్పత్రులకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు దంత, నేత్ర, ఊపిరితిత్తుల సమస్యలపై పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో ముందు జాగ్రత్తల ప్రాముఖ్యతను వివరించారు. సామాజిక సేవలో విద్యార్థులను భాగస్వాములను చేయడం ద్వారా తమలోని నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవడంతో పాటు వ్యక్తిత్వాన్ని మెరుగుపరచుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ తేజ, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సాయిబాబులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంబీఏ విభాగాధిపతి వి.చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె.లలిత, అసోసియేట్ ప్రొఫెసర్ డి.కళ్యాణి పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాసవి నగర్ సమీపంలో నివాసం ఉండే తియ్యగూర మునిరెడ్డి (60) లారీ డ్రైవర్‌గా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మునిరెడ్డి పురుగు మందు సేవించి బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని బంధువుల ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సిబ్బంది లేక ఇబ్బంది

- పొన్నూరు మున్సిపాల్టీలో తీవ్రంగా సిబ్బంది కొరత
- పడకేసిన పారిశుద్ధ్యం.. అభివృద్ధి పనులకు అంతరాయం
- అవుట్‌సోర్సింగ్ సిబ్బందిపై అదనపు భారం
- ప్రజలకు పూర్తిస్థాయిలో అందని సేవలు



పొన్నూరు మున్సిపల్ కార్యాలయం

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. అన్ని విభాగాలకు తగినంత సిబ్బంది లేక పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. మున్సిపాలిటీలో పర్మినెంట్ ఉద్యోగులస్థానాలు భర్తీకాక ఇన్‌చార్జ్‌లతో కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రధాన విభాగాలలో సిబ్బంది కొరత కారణంగా అటు అధికారులు, ఇటు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఇంజినీరింగ్, రెవెన్యూ విభాగాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో పట్టణంలో అభివృద్ధి పనులకు అంతరాయం కలుగుతోంది. పారిశుద్ధ్య సమస్య కూడా పట్టణ వాసులను వెంటాడుతోంది. పర్మినెంట్ కార్మికులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అవుట్‌సోర్సింగ్ వర్కర్లపై పనిభారం పడుతోంది.

ఖాళీలు ఇలా..

మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న పోస్టులు 71, వాటిలో డీఈ 1, శానిటరీ ఇన్‌స్పెక్టర్ 1, ప్రజారోగ్య కార్మికులు 34, ట్రాక్టర్ డ్రైవర్ 3, పంప్ హౌస్ క్లీనర్ 1, మేస్త్రి 1, మజ్దూర్ కార్మికులు 3, టీపీఓ గ్రేడ్ 2 పోస్టు 1, బిల్డింగ్ ఓవర్‌సీర్ 4, సూపర్‌వైజర్ 1, సర్వేయర్ 1, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ 1, అసిస్టెంట్ ఇంజినీర్ 2, వర్క్ ఇన్‌స్పెక్టర్ 1, స్విచ్ బోర్డు ఆపరేటర్లు 2, జూనియర్ అకౌంటెంట్ 2 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా అకౌంటెంట్, బిల్ కలెక్టర్, రికార్డ్ అసిస్టెంట్, టైపిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నైట్ వాచ్‌మెన్ కూడా లేకపోవడంతో కార్యాలయానికి రాత్రిళ్లు భద్రత కరువైంది. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ జరుగుతుండటంతో ఇప్పటికైనా పూర్తిస్థాయిలో సిబ్బంది పొన్నూరుకు వస్తారని పురపాలక ప్రజలు ఆశతో ఎదురుచూస్తున్నారు.

కీలకమైన విభాగాల్లో ఇబ్బంది

నిర్మాణాలను పర్యవేక్షించే టౌన్‌ప్లానింగ్ విభాగంలో పూర్తిస్థాయిలో సిబ్బంది లేరు. అక్రమ నిర్మాణాలపై పర్యవేక్షణ పూర్తిస్థాయిలో సిబ్బంది ఉంటేనే సాధ్యమవుతోంది. అలానే ఇంజినీరింగ్ విభాగంలో ఏఈలు లేకపోవడంతో తాగునీటి సరఫరా, రోడ్ల పర్యవేక్షణ కొరవడుతోంది. ఇతర విభాగాల్లో కూడా కొరత ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో రోడ్లు అత్యంత దయనీయంగా ఉన్నాయి. వీధిలైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. ఉన్న సిబ్బంది పనులు చేయడంలేదని విమర్శలు వస్తున్నాయి. కీలక విభాగాల్లో అయినా పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకాలు జరిగితే మున్సిపాలిటీలో సమస్యలు తీరుతాయి.

పొన్నూరు పురపాలక సమాచారం	
పట్టణంలో వార్డులు	31
సచివాలయాలు	17
జనాభా	70 వేలు
ఉండాల్సిన సిబ్బంది	133
ప్రస్తుతం ఉన్న సిబ్బంది	62

పూర్తిస్థాయి సిబ్బంది నియామకానికి చర్యలు



పొన్నూరు పురపాలక సంఘం పరిధిలోని 31 వార్డులలో ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు చేపడతాం. అన్ని విభాగాల్లో సిబ్బంది ఖాళీలను భర్తీ చేసేవిధంగా నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, సమస్యను పరిష్కరిస్తాం.

– రమేష్‌బాబు, మున్సిపల్ కమిషనర్, పొన్నూరు

ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు

అంతర్జాతీయ పురస్కారాలు



పురస్కారాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ట్యునీషియా దేశంలో జరిగిన ఏసిస్ట్12–2024 ఇంటర్నేషనల్ టాలెంట్ షో పోటీల్లో తమ కళాశాల విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు రావటం సంతోషకరమని ఆర్వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళిమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. గురువారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల దిశగా, నిత్యం పరిశోధనలతో విద్యార్థుల్లో నెలకొన్న పోటీతత్వంలో, తమ కళాశాల విద్యార్థుల ప్రతిభకు అంతర్జాతీయస్థాయిలో పురస్కారాలు లభించడం కళాశాలకే గర్వకారణమన్నారు. ఈ నెల 7, 8 తేదీలలో రెండు రోజుల పాటు ట్యునీషియా దేశంలోని, ట్యునీష్ సైన్స్ సిటీలో ఐఈఈఈ ఆధ్వర్యలో ఏసిస్ట్12 పేరుతో నిర్వహించిన ఇంటర్నేషనల్ టాలెంట్ షోలో తమ కళాశాల విద్యార్థులు జి.భరణి విష్ణు, బత్తుల త్రినాధ్, బోయపాటి శ్రీనివాసులు, ఎర్రెద్దుల విన్నూత్నల జట్టు రూపొందించిన కృత్రిమ అవయవ ఆవిష్కరణ ప్రదర్శన అంతర్జాతీయ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచి హానరబుల్ మెన్షన్ టైటిల్ అవార్డును దక్కించుకుందన్నారు. అదే విధంగా మెకానికల్ విభాగంలో మూడవ సంవత్సరం చదువుతున్న కె.హర్షతేజ, కె.గోపివాసవి, ఎస్.హరీష్‌చౌదరి, కె.రాజాఅభిజీత్‌ల బృందం రూపొందించిన చిల్లీ డిపిడికిల్ అనే నూతన యంత్ర ఆవిష్కరణ అంతర్జాతీయ స్థాయిలో గ్రాండ్ ఫినాలేలో చేరి ప్రశంసా పురస్కారం దక్కించుకున్నారన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, సిబ్బంది అవార్డులను సాధించిన విద్యార్థులను అభినందించి జట్టుకు రూ 10 వేల చొప్పున రెండు జట్ల విద్యార్థులకు రూ 20 వేలు ప్రోత్సాహక నగదు పురస్కారాన్ని అందజేశారు. కళాశాల ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణలు మాట్లాడారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థుల రవాణా, వసతి, ఇతర సౌకర్యాలకు అవసరమైన పూర్తి ఖర్చు రూ 3.5 లక్షలు కళాశాల ద్వారానే అందించడం జరిగిందని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ పురస్కార పత్రాలను ఐఈఈఈ ట్యునీషియా సెషన్ చైర్మన్ హబీబ్ కమౌన్, ఐఈఈఈ ఏసిస్ట్ 12–2024 జనరల్ చైర్మన్ రామలత మరిముత్తు, మేకర్ ఫెయిర్ ట్రాక్ చైర్మన్ ఎం.అరుణ్ చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ శ్రీనివాసరావు, డాక్టర్ డీవీవీ కృష్ణప్రసాద్, డాక్టర్ ఎన్.నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు రోడ్డుపై చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

పొన్నూరు: మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై అధ్వానంగా ఉన్న చెత్తను తొలగించారు. రేపల్లెకు వెళ్లే ప్రధాన రహదారిపై చెత్త, వ్యర్థాలను నిల్వ చేస్తుండటంతో ప్రజల ఇబ్బందులను తెలియజేస్తూ ఈ నెల 11వ తేదీన 'చెత్త శుద్ధి లేక, కొరవడిన పర్యవేక్షణ' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు స్పందించారు. యుద్ధ ప్రాతిపదికన చెత్త తొలగింపు చర్యలు చేపట్టారు. శానిటేషన్ విభాగం ప్రొక్లెయిన్ ద్వారా చెత్తను తరలించి, సమస్యను పరిష్కరించారు.



రోడ్డుపై చెత్త తరలింపును పరిశీలించిన కమిషనర్ రమేష్‌బాబు

టీడీపీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి

- మన్నవ ఎంపీటీసీపై అక్రమ కేసు బనాయించారు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: టీడీపీ నేతలు రాజకీయ పరమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆరోపించారు. మండలంలోని మన్నవ గ్రామ ఎంపీటీసీ బొనిగల అమరేంద్రప్రసాద్, బొనిగల సుమన్‌బాబు, తదితరులపై కక్షపూరితంగా వ్యవహరించి గ్రామ కార్యదర్శితో అక్రమ కేసు పెట్టించిన వైనాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ నెల 7వ తేదీన అమరేంద్రప్రసాద్, సుమన్‌బాబులతో పాటు పలువురిని స్థానిక టీడీపీ నాయకులు దాడిచేసి గాయపరచడమే కాకుండా, వారిపైనే రాజకీయ అండదండలతో పథకం ప్రకారం ఎరువులు దొంగిలించారని కార్యదర్శితో కేసు పెట్టించడం దారుణమన్నారు. ఇది ముమ్మాటికీ రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. అధికారులను ఒత్తిళ్లకు గురిచేసి అక్రమంగా కేసులు బనాయించారని అన్నారు. ఎంపీపీ భవనం పద్మలీల, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆదిశేషులు, మన్నవ గ్రామ సర్పంచ్ బొనిగల నాగమల్లేశ్వరరావు, నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ నాజర్ తదితరులు గురువారం ఒక ప్రకటనలో అక్రమ కేసును ఖండించారు.

నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలి

పొన్నూరు: సినిమా థియేటర్లలో అందించే తినుబండారాలను నాణ్యతతో అందించాలని, ప్రేక్షకుల నుంచి ఫిర్యాదులు వస్తే తప్పక చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు థియేటర్ నిర్వాహకులను హెచ్చరించారు. గురువారం ఆయన పట్టణంలోని పలు సినిమా హాళ్లు, కూరగాయల మార్కెట్, అన్న క్యాంటీన్‌ను సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య వాహనాల్లో మాత్రమే చెత్త వేయాలని, గృహవాసులు, వ్యాపారులు రోడ్లపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని తెలిపారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యాలను పరిరక్షించుకోగలమని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతికి నివాళి



పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామానికి చెందిన తురిమెళ్ల ప్రసాదరావు ప్రమాదవశాత్తు మరణించారు. సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పొన్నూరు సయన్వయకర్త అంబటి మురళీకృష్ణ గ్రామంలోని ప్రసాదరావు నివాసంలో ఆయన భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబీకులను పరామర్శించారు.

- ఇటీవల పట్టణానికి చెందిన పల్లికోన రవిబాబు మరణించారు. విషయం తెలుసుకున్న అంబటి మురళీకృష్ణ రవిబాబు నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాయకులు షేక్ నాజర్, ఆకుల వెంకటేశ్వరరావు, గేరా సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

17న ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారాలు

చేబ్రోలు: చేబ్రోలులో లగడపాటి సీతారామయ్య ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2024 అందజేయనున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు లగడపాటి వేణుగోపాల్ గురువారం తెలిపారు. ఈ నెల 17వ తేదీన సాయంత్రం 4.30లకు చేబ్రోలు మండల యూటీఎఫ్ శాఖ కార్యాలయంలో చేబ్రోలు మండల పరిధిలోని 16మందికి ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

మహిళల్లో పెరుగుతున్న మానసిక సమస్యలు



డాక్టర్ ఉమాజ్యోతికి స్టూళ్లు అందజేస్తున్న విజయలక్ష్మి, సిద్ధార్థ

గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలి వల్ల మహిళల్లో మానసిక సమస్యలు నేడు బాగా పెరగడం చాలా ఆందోళనకరమైన విషయమని సఖి కేంద్రం లీగల్ అడ్వైజర్ విజయలక్ష్మి అన్నారు. గురువారం గుంటూరు జీజీహెచ్ మానసిక వ్యాధుల విభాగంలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే సందర్భంగా రోగులకు అవసరమైన స్టూళ్లను విజయలక్ష్మి సహకారంతో సెవెన్ గ్రీన్ ఫౌండేషన్ నిర్వాహకులు సిద్ధార్థ అందజేశారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మానసిక వ్యాధుల విభాగంలో వైద్య సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. విభాగంలో రోగులకు మెరుగైన సేవలందించేందుకు తమవంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామని సిద్ధార్థ పేర్కొన్నారు. జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ మానసిక వ్యాధుల విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలతో కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. అన్ని రకాల మానసిక సమస్యలకు చికిత్సలు అందించి మందులు సైతం అందిస్తున్నామని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకటకిరణ్ తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ నిమిషా, డాక్టర్ రత్నకిషి, డాక్టర్ సాయికృష్ణ, సీనియర్ సైక్రియాటిస్ట్ డాక్టర్ ప్రసాద్, సీనియర్ రెసిడెంట్ డాక్టర్ రమ్య, పలువురు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

'బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్' ప్రారంభం



బాక్స్ ఆఫ్ కైండ్‌నెస్‌ను ప్రారంభిస్తున్న జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి, అధికారులు

లక్ష్మీపురం: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు ఆంధ్రప్రదేశ్ లోని పలు కస్టమ్స్, జీఎస్టీ శాఖ కార్యాలయాలలో 'బాక్స్ ఆఫ్ కై ండ్‌నెస్' కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అన్నారు. గుంటూరు కన్నవారితోటలోని కేంద్ర జీఎస్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో నరసింహారెడ్డి బాక్స్ ఆఫ్ కైండ్ నెస్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 19వ తేదీ బాక్స్ ఆఫ్ కై ండ్‌నెస్ కొనసాగుతుందన్నారు. ఎనిమిది రోజుల పాటు ఉద్యోగుల నుంచి సేకరించిన వస్తు సామగ్రిని కిట్ ల రూపంలో వరద బాధితులకు పంపిణీ చేస్తామన్నారు. విజయవాడ వరద ప్రాంతాలలో రెండు రోజులపాటు నిర్వహించిన రెస్క్యూ,రిలీఫ్ ఆపరేషన్ లో చురుగ్గా పాల్గొన్న ఉద్యోగులకు, వలంటీర్లకు ఈ సందర్భంగా కమిషనర్ ప్రశంసాపత్రాలు ఇచ్చి సత్కరించారు. అదనపు కమిషనర్ ఎస్.మధుసూదన రెడ్డి, జాయింట్ కమిషనర్ బి.లక్ష్మినారాయణ అసిస్టెంట్ కమిషనర్లు ఎం.నాగరాజు, రవికుమార్ సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు

పాటలేని ప్రపంచాన్ని ఊహించలేం

లక్ష్మీపురం: మనిషిని కదిలించి కరిగించే మహత్తర శక్తి సంగీతానిదని, సందర్భమేదైనా, దానికి గళమిచ్చేది సంగీతమేనని సాంస్కృతిక కార్యక్రమాల కో–ఆర్డినేటర్ బిళ్లా అశోక్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం పాడుదం రండి బృందం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాటలేని ప్రపంచాన్ని ఊహించలేమన్నారు. నేటికీ సంగీతానికి ఆదరణ తగ్గలేదన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, సీనియర్ గాయకుడు రత్నాజీ మాట్లాడారు. అదేవిధంగా పారిస్‌లో జరిగిన పారాలింపిక్స్‌లో భారత బృందం కొత్త చరిత్రను లిఖించడంపై సంస్థ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

కాకుమాను: గత ఐదు రోజులుగా విశేష పూజలు అందుకున్న బొజ్జ గణపయ్య గురువారం మేళ తాళాల మధ్య నిమజ్జనాని తరలివెళ్లాడు. పెదనందిపాడు లయన్స్ మాంటిస్సోరి (సీబీఎస్)పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన లంబోధరున్ని విద్యార్థులు ప్రత్యేక వాహనంపై ఏర్పాటు చేసి నిమజ్జనానికి తరలించారు. అయితే ఎటువంటి రక్షణ లేకుండా విద్యార్థులు ప్రమాదకరంగా వాహనంపై తరలడంపై చూపరులు ఆందోళన వ్యక్తం చేశారు.



గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న విద్యార్థులు

నష్టపోయిన రైతులను, పేదలను ఆదుకోవాలి



గుంటూరు చానల్ వద్ద కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

పెదకాకాని: భారీ వర్షాలు, వరదల వల్ల జిల్లాలో లక్ష ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వెంటనే రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కేంద్ర బృందాన్ని కోరారు. గుంటూరు జిల్లాలో వరద నష్టాన్ని పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి పెదకాకాని మండలంలోని గుంటూరు చానల్ వద్ద సీపీఎం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తి, మిర్చి, కంద, అరటి, పసుపు, నిమ్మ, తమలపాకులు, కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. ఉద్యాన పంటలకు కౌలుతో సహ ఇప్పటికే రూ.2లక్షలు, వరికి రూ.70వేలు ఖర్చు చేశారన్నారు. పంటలన్నీ నీట మునిగి సర్వం కోల్పోయి, రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వ్యాపార పంటలకు ఎకరాకు రూ.లక్ష, వరికి రూ.30వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు 10వేలు నష్టపరిహారం ఇస్తామని ప్రకటించడం సరికాదన్నారు. కేంద్ర బృందాన్ని కలిసిన వారిలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈమని అప్పారావు, జిల్లా నాయకులు జొన్నా శివశంకర్, సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, బైరగాని శ్రీనివాసరావు, కె.అజయ్‌కుమార్, కె.సత్యనారాయణ, వెంకటరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు ఉన్నారు.

పోషకాహారంపై అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్. భారతి

ప్రత్తిపాడు: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్తిపాడు సెక్టార్‌లోని చినకోండ్రుపాడు మెయిన్, గంగమ్మ గుడి సెంటర్లలో గొట్టిపాడు సెక్టార్‌లోని గొట్టిపాడు డిడబ్ల్యూ అంగన్‌వాడీ కేంద్రంలో తక్కువ ఖర్చుతో అధిక పోషక విలువలున్న ఆహారాన్ని తయారు చేసి పోషకాహారాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వం సరఫరా చేసే బాలామృతంతో ఎలాంటి వంటలు చేసుకోవచ్చు, పోషకాహార లోపాన్ని ఎలా అధిగమించాలి..వంటి అంశాలను ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎస్ భారతి, పి.మాధవిలు తల్లులు, గర్భిణులు, మహిళలకు వివరించారు. పరిశుభ్రతతో కూడిన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని తెలిపారు. రోజువారీ తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు అధికంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏఎస్ఎంలు వి.పరమేశ్వరి, వి.ఆంథోని, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.అక్కమ్మ, వి.నాగలక్ష్మి, సీహెచ్ నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

యువత సైన్యంలో చేరాలి



ఏసీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లతో మేజర్ అమర్‌దీప్, ప్రిన్సిపాల్ మోజెస్

గుంటూరు ఎడ్యుకేషన్: యువతరం సైన్యంలో చేరి దేశ రక్షణ విధుల్లో భాగస్వాములు కావాలని ఆర్మీ రిక్రూట్‌మెంట్ వైద్యాధికారి డాక్టర్ మేజర్ అమర్‌దీప్ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ఏసీ కళాశాలలో గురువారం భారత సైన్యంలో చేరేందుకు అగ్నివీర్‌తో పాటు ఆర్మీలో ఉద్యోగావకాశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమర్‌దీప్ మాట్లాడుతూ ఆర్మీలో చేరిన వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను గురించి వివరించారు. గుంటూరు నగరంలో ఘన చరిత్ర కలిగిన ఏసీ కళాశాలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆర్మీలో చేరాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మోజెస్ మాట్లాడుతూ కళాశాల పూర్వ విద్యార్థులు ఎంతో మంది ఆర్మీలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారని, భవిష్యత్తులో విద్యార్థులను ఇంకా పెద్ద సంఖ్యలో ఆర్మీకి పంపేందుకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ 25 ఆంధ్ర బెటాలియన్ అధికారి లెఫ్టినెంట్ ఎల్‌కే సాగర్, ఆర్మ్‌డ్ బెటాలియన్ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కె.రవి, మాజీ సైనిక అధికారి సుబేదార్ అబ్దుల్ బేగ్, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: అనుమానాస్పద స్థితిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన దుద్దుల పాపయ్య (45) నగరంపాలెం వద్ద ఇస్త్రీ పనిచేస్తూ ఉంటాడు. బుధవారం రాత్రి పనిముగిసిన అనంతరం ఇంటికి వెళుతూ హౌసింగ్‌బోర్డ్ కాలనీవ వద్ద మద్యం తీసుకుని సమీపంలోని పొలాల్లో సేవించేందుకు వెళ్లాడు. అక్కడ మద్యం సేవిస్తుండగా ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు తనపై పెట్రోలు పోసి తగలబెట్టారని మంటలను ఆరిప్పేసుకుని రుద్ర ట్రస్ట్ సహకారంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారని చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.